రోడ్డు దాటాలంటే.. తప్పని ఫీట్లు



గత ప్రభుత్వ హయాంలో ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణం కోసం సిద్ధం చేసిన సామగ్రి



రైలింగ్ దాటలేక దూరమైనా నడుస్తూ పాఠశాలకు వెళ్తున్న మధురవాడ హాస్టల్ విద్యార్థులు

- మధురవాడ జంక్షన్ వద్ద నిత్యం ఇదే పరిస్థితి
- ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణంలో జాప్యంతో ఇక్కట్లు
- ప్రకటనలకే పరిమితం అవుతున్న పాలకులు



మధురవాడ జోనల్ ఆఫీసు వద్ద రైలింగ్ కింద నుంచి పాకుతున్న యువతి

మధురవాడ: మధురవాడ జోన్–2 కేంద్రంలో ఇటు కార్‌షెడ్ జంక్షన్ నుంచి అటు కొమ్మాది జంక్షన్ వరకు జాతీయ రహదారిపై రోడ్డు దాటడానికి వీలు లేకుండా సెంటర్ డివైడర్‌పై సుమారు 6 అడుగుల ఎత్తులో రైలింగ్ ఏర్పాటు చేశారు. ఇది మధురవాడ ప్రాంతాన్ని రెండు భాగాలుగా విడగొట్టింది. గతంలో చంద్రంపాలెం హైస్కూలు వద్ద సిగ్నల్ పెట్టి విద్యార్థులు రోడ్డు దాటడానికి అవకాశం కల్పించినా కొన్ని ప్రమాదాలు జరగడంతో దాన్ని మూసేశారు. బస్సులు, గుడి, బడి, జోన్ కార్యాలయం, బ్యాంకు, మార్కెట్, హాస్పిటల్, కరెంటు ఆఫీసు ఇలా ఏ పని కోసం అయినా రోడ్డు దాటాల్సిందే. అలా చేయాలంటే ఇటు కొమ్మాది జంక్షన్ లేదా మధురవాడ ఆప్ బ్రిడ్జి ఎటు చూసినా అర కిలోమీటరు దూరం వెళ్లాలి. కాళ్లకు పని చెప్పలేక, ఆటోలను ఆశ్రయించలేక తప్పని పరిస్థితుల్లో వందలాది మంది నిత్యం ప్రమాదం అని తెలిసినా రైలింగ్ ఎక్కి దాటుతున్నారు. కొందరు అయితే జంపింగ్ చేస్తున్నారు. రైలింగ్ ఊచల మధ్య సందుల్లో నుంచి దూరి రోడ్డు దాటుతూ గమ్యస్థానాలకు చేరే క్రమంలో ఫీట్లు చేస్తున్నారు.

కార్యరూపం దాల్చని ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణం..

గత ప్రభుత్వ హయాంలో ఓ ప్రైవేటు ఏజెన్సీ **ద్వారా ఫు**ట్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణం కోసం పను**లకు శంకు**స్థాపన చేశారు. ఎన్నికల కోడ్ **రావడంతో** పనులు అర్ధాంతరంగా ఆగిపో**యాయి.** కూటమి ప్రభుత్వం ఆ టెండర్‌ను **రద్దు చేసిం**ది. జీవీఎంసీ ద్వారా నిర్మాణం **చేస్తామని** ప్రకటనలు మాత్రం చేస్తున్నా కార్య**రూపం** దాల్చడం లేదు. దీంతో రాష్ట్రంలో **పెద్దది అయిన** చంద్రంపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు, ఇతర వర్గాల ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు.



చంద్రంపాలెం హైస్కూలు వద్ద రైలింగ్ దాటుతున్న క్రీడాకారులు



మధురవాడ బస్టాప్ వద్ద విద్యా సంస్థలకు వెళ్లడానికి రైలింగ్ దాటుతున్న విద్యార్థులు

అప్పల నర్సమ్మకు ఘన నివాళి



అప్పల నర్సమ్మ చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

మధురవాడ: ఏపీ నగరాలు కార్పొరేషన్ మాజీ చైర్‌పర్సన్ పిళ్లా సుజాత అత్త, వైఎస్సార్‌సీపీ బీసీ విభాగం రాష్ట్ర సహాయ కార్యదర్శి పిళ్లా సత్యనారాయణ, ఏపీ నగరాలు విభాగం యువజన కార్యదర్శి పిళ్లా సూరిబాబుల మాతృమూర్తి పిళ్లా అప్పలనర్సమ్మకి పలువురు వైఎస్సార్‌సీపీ, అఖిల పక్ష పార్టీల నాయకులు ఘనంగా నివాళులు అర్పించారు. ఆదివారం జీవీఎంసీ 6వ వార్డు రేవళ్లపాలెంలో ఆమె దశ దిన కర్మ, సంస్మరణ సభ నిర్వహించారు. ఇందులో ఆమె మృతికి సంతాపం ప్రకటించి, వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. వీరిలో వైఎస్సార్‌సీపీ నాయకులు పోతిన హనుమంతరావు, వెంపాడ శ్రీనివాసరెడ్డి, గుడ్ల పోలిరెడ్డి, అఖిలపక్ష పార్టీల నాయకులు, పలువురు పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు

పీఎం పాలెం: జీవీఎంసీ 6వ వార్డులోని శ్రీ సాయి టవర్స్ అపార్ట్ మెంట్‌లోని ఫ్లాట్ నంబరు 102లో ఎస్‌కే ఆండ్ బాషా (45) కుటుంబంతో నివసిస్తున్నాడు. ఈ నెల 11వ తేదీ మధ్యాహ్నం ఎవరికీ చెప్పకుండా ఇల్లు విడిచి వెళ్లిపోయాడు. అతని భార్య భర్త ఆచూకీ కోసం ప్రయత్నించినా ఫలితం లేకపోవడంతో పోలీసులను ఆశ్రయించింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ బాలకృష్ణ తెలిపారు.

క్లుప్తంగా

యువతకు స్ఫూర్తి స్వామి వివేకానంద



గాలి పటాల పోటీ ప్రారంభిస్తున్న సీఐ శ్రీధర్

పద్మనాభం: నేటి యువతరం స్వామి వివేకానందుని స్ఫూర్తిగా తీసుకుని ముందడగు వేయాలని సీఐ సీహెచ్ శ్రీధర్ తెలిపారు. పద్మనాభం గోస్తని విద్యా పీఠంలో నెహ్రూ యువ కేంద్రం, గాయత్రి వెల్ఫేర్ కల్చరల్ యూత్ అకాడమీ సంయుక్తంగా నిర్వహించిన యువజనోత్సవాల ముగింపు సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశ సంపద యువతే అన్నారు. యువత మత్తు పదార్థాలకు బానిసలు కాకూడదన్నారు. విద్య, క్రీడా, సామాజిక రంగాల్లో రాణించి కీర్తి ప్రతిష్టలు సంపాదించుకోవాలన్నారు. ముందుగా ఆయన స్వామి వివేకానందుని చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. దీనిలో భాగంగా గాలిపటాలు, ముగ్గుల పోటీలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రాజీవ్ గాంధీ జాతీయ సేవా అవార్డు గ్రహీత రూపాకుల రవికుమార్, గోస్తని విద్యా పీఠం కరస్పాండెంట్ కాళ్ల సూరిబాబు, తమటపు నాగమణి, రెడ్డిపల్లి శ్రీనివాసరావు, పాలూరి కృష్ణారావు, సిరిపురపు వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

సొంత గనుల కేటాయింపుతోనే ఉక్కు అభివృద్ధి



రాస్తారోకో నిర్వహిస్తున్న సీపీఎం నాయకులు


భీమునిపట్నం: స్టీల్‌ప్లాంట్‌కు కేంద్రం సొంతగనులు కేటాయించాలని, అప్పుడే అది అభివృద్ధి చెందుతుందని భీమిలి జోన్ సీపీఎం కార్యదర్శి ఆర్.ఎస్.ఎన్.మూర్తి అన్నారు. ఆదివారం సీపీఎం ఆధ్వర్యంలో తగరపువలస జంక్షన్ వద్ద నిర్వహించిన రాస్తారోకో కార్యక్రమంలో పాల్గొన్నారు. స్టీల్ ప్లాంట్‌కు కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన ప్యాకేజీ కేవలం తాత్కాలిక ఉపశమనమన్నారు. ప్లాంట్ అన్ని విధాలుగా బాగుండాలంటే పూర్తిస్థాయిలో సహకారం అందించి, వీఆర్‌ఎస్‌ను రద్దు చేయాలన్నారు. ఖాళీగా ఉన్న అయిదు వేల ఉద్యోగాలను భర్తీ చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు రవ్వ నర్సింగరావు, నీలాతి రాము, జోగి ఆనంద్, జీరు సత్యారావు తదితరులు పాల్గొన్నారు.

కనకమహాలక్ష్మి ఆలయంలో ఆయుష్ హోమం



దాబాగార్డెన్స్: కనకమహాలక్ష్మి అమ్మవారు జన్మించిన ఉత్తరా నక్షత్ర పుణ్యకాలాన్ని పురస్కరించుకుని ఆదివారం ఆయుష్ హోమం శాస్త్రోక్తంగా నిర్వహించారు. కార్యక్రమంలో దేవస్థాన అధికారులు, వేదపండితులు, అర్చకులు పాల్గొన్నారు.

పేరుకుపోయిన ప్లాస్టిక్ వ్యర్థాలు



మహారాణిపేట: ఫిషింగ్ హార్బర్‌లో ప్లాస్టిక్ వ్యర్థాలు పేరుకుపోయాయి. జనవరి 1వ తేదీ నుంచి ప్లాస్టిక్‌ను నిషేధించాలని అధికార యంత్రాంగం పిలుపునిచ్చింది. కాని ఫిషింగ్ హార్బర్‌లో ఎక్కడ పడితే అక్కడ ప్లాస్టిక్ వ్యర్థాలు, చెత్త చెదారాలు కనబడుతున్నాయి. జెట్టీలో ఉన్న మరబోట్ల వద్ద ప్లాస్టిక్ వ్యర్థాలు పేరుకుపోయాయి. చేపలు వేటాడిన తర్వాత వ్యర్థాలు, ఇతర సామగ్రిని సముద్రంలో పడేస్తున్నారు. సముద్రంలో వదిలేసిన వ్యర్థాలు ఒడ్డుకు చేరుకుంటున్నాయి.

పద్ధతి మార్చుకోకపోతే కఠిన చర్యలు



బీచ్ ఫొటోగ్రాఫర్లను హెచ్చరిస్తున్న సీఐ సుధాకర్



రౌడీషీటర్లతో మాట్లాడుతున్న సీఐ సుధాకర్

భీమునిపట్నం: పద్ధతి మార్చుకుని సవ్యంగా వ్యవహరించకపోతే కఠిన చర్యలు తప్పవని సీఐ బొడ్డేపల్లి సుధాకర్ హెచ్చరించారు. బీచ్ ఫొటోగ్రాఫర్లకు ఆదివారం పోలీస్‌స్టేషన్ వద్ద కౌన్సెలింగ్ నిర్వహించడంతో పాటు హెచ్చరించారు. గత కొంత కాలంగా బీచ్‌లో స్వయం ఉపాధి పేరుతో కొంత మంది ఫొటోగ్రాఫర్లు సందర్శకుల ఫొటోలు తీస్తామని అడుగుతున్నారు. కొందరు తీయించుకుంటున్నారు. తీయించుకోవడానికి అంగీకరించని సందర్శకులను ఫొటోగ్రాఫర్లు వేధించడం, డబ్బులు డిమాండ్ చేస్తూ దౌర్జన్యాలకు పాల్పడుతున్నారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదులు అందడంతో వారిని సీఐ పిలిపించారు. సందర్శకులు సరదాగా బీచ్‌కు వస్తున్నారని వారిని ఇలా వేధించడం వల్ల తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఇలా జరిగితే భీమిలికి చెడ్డ పేరు రావడంతో పాటు బీచ్‌కు ఎవరు రావడానికి ఇష్టపడరని అన్నారు. ఇటువంటి వాటిని తాము ఏమాత్రం సహించేది లేదని, ఇకపై ఎవరినైనా వేధిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అలాగే భీమిలి పరిధిలోని రౌడీషీటర్లకు కూడా కౌన్సెలింగ్ నిర్వహించారు. అందరు గతాన్ని మర్చిపోయి పద్ధతిగా నడుచుకోవాలని, గొడవలు, అల్లర్లకు పాల్పడరాదన్నారు. పద్ధతి మార్చుకోకపోతే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఐ హరీష్ పాల్గొన్నారు.

అతిగా మద్యం సేవించి వ్యక్తి మృతి

పీఎం పాలెం: అతిగా మద్యం సేవించిన వ్యక్తి మరణించిన ఘటనపై పీఎం పాలెం పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదయింది. ఇందుకు సంబంధించి స్థానిక సీఐ బాలకృష్ణ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కూలి పనులు చేసుకునే సూరిబాబు (32) రుషికొండలోని వీపీఆర్ కన్‌స్ట్రక్షన్స్‌లో రాడ్ బెండింగ్ పనులు చేసే కర్రి వీరనాగ సతీష్ కుమార్‌ను 12వ తేదీన కలిశాడు. తనకు ఏదైనా పని ఇప్పించాలని కోరాడు. సూరిబాబు దీన స్థితి చూసి తాను పని చేస్తున్న కంపెనీకి చెందిన షెడ్‌లో నివసించడానికి ఆశ్రయం ఇచ్చాడు వీరనాగ సతీష్ కుమార్. అలాగే కొంత సొమ్ము కూడా ఇచ్చాడు. ఈ క్రమంలో అతిగా మద్యం సేవించడం వల్ల అనారోగ్యానికి గురైన సూరిబాబును 18వ తేదీన ఆస్పత్రికి తీసుకెళ్లాడు. అతనికి కామెర్ల వ్యాధి ఉందని వైద్యులు తెలిపారు. దీంతో మరలా అతన్ని షెడ్‌కు తరలించాడు వీరనాగ సతీష్ కుమార్. 19వ తేదీ ఉదయం షెడ్‌కు వెళ్లి చూడగా సూరిబాబు మరణించి ఉన్నాడు. వీరనాగ సతీష్‌కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

తాగునీటి ఇక్కట్లలో మల్లయ్యపాలెం



మల్లయ్యపాలెంలో మూలకు చేరిన వాటర్ ట్యాంక్

మధురవాడ: జీవీఎంసీ 7వ వార్డు మల్లయ్యపాలెంలో తాగునీటి వాటర్ ట్యాంక్ మూలకు చేరి ఏళ్లు గడుస్తోంది. ఇది పూర్తిగా పాడైపోవడంతో ప్రమాదకరంగా కూడా మారింది. దీంతో ఈ ప్రాంతానికి ఆర్‌టీసీ కాలనీ, శివశక్తినగర్ వాటర్ ట్యాంక్‌ల నుంచి నీరు అంతంత మాత్రంగా అందిస్తున్నారు. 1990 నాటి వాటర్ ట్యాంక్ కావడంతో ఇది పూర్తిగా శిథిల స్థితికి చేరింది. కనీసం శిలాఫలకం కూడా ఆనవాళ్లు లేనట్టు ఉంది. ఊరి మధ్యలో రామాలయానికి అతి చేరువలో ఈ వాటర్ ట్యాంక్ ఉంది. దీనిని కూలగొట్టి దాని స్థానంలో వేరే ట్యాంక్ నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు. ఇక్కడ వాటర్ ట్యాంక్ నిర్మిస్తే తాగునీటి సమస్యలు పూర్తి స్థాయిలో తొలగుతాయని గ్రామస్తులు అంటున్నారు. వాటర్ ట్యాంక్ నిర్మించి శాశ్వతంగా తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

ఆరు నెలల్లో ఇంటింటికీ వైద్య పరీక్షలు

రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్



గుడిలోవ విజ్ఞాన్ విహార్‌లో ఆరోగ్య కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మంత్రి సత్యకుమార్

మధురవాడ: రాబోయే ఆరునెలల్లో గ్రామాలను యూనిట్లుగా తీసుకుని ఇంటింటికీ వైద్య పరీక్షలు నిర్వహిస్తామని రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ తెలిపారు. ఆదివారం ఆనందపురం మండలం గుడిలోవ విజ్ఞాన విహార్ పాఠశాలలో డాక్టర్ హెడ్గేవార్ నూతన ఆరోగ్య కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అందరు ఆరోగ్యం పట్ల శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. మహిళల్లో వచ్చే వివిధ రకాలైన క్యాన్సర్లకు స్క్రీనింగ్ చేసి ఆయుష్మాన్ భారత్ ద్వారా వైద్యం అందుతోందని, దీన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా మంత్రి సత్యకుమార్‌కు పలువురు వినతిపత్రాలు అందించారు. కార్యక్రమంలో ఆర్‌ఎస్‌ఎస్ కార్యకారిణి సభ్యులు భాగయ్య, ప్రముఖ గుండె వైద్య నిపుణుడు డాక్టర్ సీవీరావు, కమిటీ కార్యదర్శి డి.సుబ్రహ్మణ్యం, కోశాధికారి జి.వెంకటప్పడు, అధ్యక్షుడు పీవీ నారాయణరావు, అఖిల భారత విద్యా భారతి అధ్యక్షుడు, విజ్ఞాన్ విహార్ డైరెక్టర్ దూసి రామకృష్ణ పాల్గొన్నారు.

మహిళల రక్షణకు కృషి

సీతంపేట: గ్లోబల్ పింక్ ఆర్మీ విశాఖ శాఖను ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సంస్థ ప్రతినిధి కొత్తపల్లి జ్యోతి మాట్లాడుతూ గ్లోబల్ పింక్ ఆర్మీని సింధు మంగళవేద స్థాపించారని తెలిపారు. కేరళ, కర్ణాటక రాష్ట్రాల్లో సేవలందిస్తున్నట్టు తెలిపారు. మహిళలు తమను తాము ఎలా రక్షించుకోవాలి, ఆరోగ్య పరిరక్షణకు తీసుకోవాల్సిన చర్యలపై పింక్ ఆర్మీ అవగాహన కల్పిస్తుందన్నారు. పాఠశాల స్థాయి నుంచి విశ్వవిద్యాలయ స్థాయి వరకు కళాశాల ప్రాంగణాల్లో మహిళల భద్రతకు, హింసను నివారించేందుకు చట్టపరంగా ఉన్న అవకాశాలను వివరిస్తూ అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నామని తెలిపారు. విశాఖ పార్లమెంట్ బీజేపీ కార్యదర్శి నాదెళ్ల జ్యోతి, గ్లోబల్ పింక్ సహ వ్యవస్థాపకుడు దీకప్ టాటర్ జైన్, రేంజర్ ఫోర్స్ చారిటబుల్ ట్రస్టు చైర్మన్ శిడగం నాగేంద్రబాబు, సబ్ ఇన్‌స్పెక్టర్ కె.నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అలరించిన చిన్నారుల త్యాగరాజ ఆరాధన



త్యాగరాజ కృతులు ఆలపిస్తున్న చిన్నారులు


మద్దిలపాలెం: త్యాగరాజ స్వామి వర్ధంతి ఉత్సవాల్లో భాగంగా కళాభారతిలో మూడో రోజు ఆదివారం ఆరేళ్ల నుంచి పదేళ్ల లోపు చిన్నారులు త్యాగరాజ కృతులను ఆలపించి అందరి హృదయాలు దోచుకున్నారు. ఈ కార్యక్రమాన్ని ట్రస్ట్ కార్యదర్శి డాక్టర్ రాంబాబు, ఆర్గనైజింగ్ కమిటీ చైర్మన్ వంతుల గోపాలరావు, మేనేజర్ మోహన్ దాస్ ప్రారంభించారు. అనంతరం 11 మంది చిన్నారులు త్యాగరాజ కృతుల ఆలాపనతో ఓలలాడించారు. ఈ సందర్భంగా ట్రస్ట్ కార్యదర్శి రాంబాబు మాట్లాడుతూ ఇంత చిన్న వయసులో అద్భుతంగా పాడిన చిన్నారులు భవిష్యత్‌లో గొప్ప సంగీత కళాకారులవుతారన్నారు. అనంతరం కచేరీలో డాక్టర్ ద్వారం త్యాగరాజు, కాశీ ప్రసాద్ వేణువు, లలిత చంద్రశేఖర్ గాత్రం, సుశారాపు లక్ష్మి గణపతి వయోలిన్, సరస్వతి విద్యార్థి గాత్ర కచేరీ అలరించాయి.

అవే పనులు.. శంకుస్థాపనలు మళ్లీ మళ్లీ..

- మధురవాడలో వింత పోకడ
- ఎమ్మెల్యే చేసిన పనులకు 5వ వార్డు కార్పొరేటర్ మళ్లీ శంకుస్థాపన
- ముక్కున వేలేసుకుంటున్న ప్రజలు



గత ఏడాది నవంబర్ 8న నగరంపాలెం వద్ద అభివృద్ధి పనులకు శిలాఫలకం ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే గంటా



ఎమ్మెల్యే శంకుస్థాపన చేసిన పనికి ఈనెల 17న మళ్లీ భూమి పూజ చేస్తున్న కార్పొరేటర్ హేమలత

మధురవాడ: టీడీపీ నాయకుల జిమ్మిక్కులకు అంతూ పొంతూ లేకుండా పోతోంది. తిమ్మిని బమ్మిని చేసి, చేసిన పనులకే మళ్లీ మళ్లీ శంకుస్థాపనలు చేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారు. ఇందుకు జీవీఎంసీ మధురవాడ జోన్–2 పరిధిలో 5వ వార్డు పరిస్థితే నిదర్శనం. ఇక్కడ టీడీపీ నాయకుల తీరు.. జరగాలి చెల్లికి మళ్లీ.. మళ్లీ పెళ్లి అన్న ఓ సినిమాలో కామెడీ సీన్‌ను తలపిస్తోంది. అదే పార్టీకి చెందిన ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు శంకుస్థాపన చేసిన అభివృద్ధి పనులకే జీవీఎంసీ 5వ వార్డు కార్పొరేటర్ మొల్లి హేమలత, ఇతర నాయకులు మళ్లీ భూమి పూజలు చేస్తుండడం చర్చనీయాంశంగా మారింది. వివరాలిలా ఉన్నాయి. గత ఏడాది నవంబరు 8న ఎమ్మెల్యే గంటా జీవీఎంసీ 5, 6, 7, 8 వార్డుల్లో పలు అభివృద్ధి పనులకు బొట్టవానిపాలెం, నగరంపాలెం వద్ద భూమి పూజ చేసి శిలా ఫలకాలు ఆవిష్కరించారు. అంత వరకు బాగానే ఉంది. అయితే 5వ వార్డు కార్పొరేటర్ హేమలత, ఆమె తండ్రి టీడీపీ రాష్ట్ర బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి మొల్లి లక్ష్మణరావు, ఇతర నాయకులతో కలిసి ఆ పనులకే వారానికి ఒక చోట చొప్పున మళ్లీ భూమి పూజలు చేస్తూ ప్రజలను అయోమయానికి గురి చేస్తున్నారు. నగరంపాలెం రోడ్డు నుంచి వుడా హరిత రోడ్డు పనులకు గతేడాది నవంబరు 19న అయోధ్యనగర్‌లో గ్లోబ్ స్కూలు వద్ద భూమి పూజ చేశారు. డిసెంబరు 23న గణేష్‌నగర్‌లో మరో రోడ్లు, కాలువల పనులకు, జనవరి 11న కార్పెంటర్స్ కాలనీలో రోడ్లు, కాలువలు, మెట్ల మార్గానికి భూమి పూజ చేశారు. ఇలా ప్రతిదీ చెప్పుకుంటే చాంతాడంత ఉన్నాయి. తాజాగా శుక్రవారం గాంధీనగర్‌లో రూ.20 లక్షల వ్యయంతో చేపట్టే అభివృద్ధి పనులకు మళ్లీ భూమి పూజ చేశారు. చేసిన పనులకే మళ్లీ మళ్లీ శంకుస్థాపనలు చేయడంతో జోనల్ అధికారులు కూడా ఈ కార్యక్రమాలకు ముఖం చాటేస్తున్నారు. కింది స్థాయి సిబ్బంది మాత్రం తప్పక హాజరవుతున్న పరిస్థితులు నెలకొన్నాయి. టీడీపీ నాయకుల తీరు చూసి ప్రజలు ముక్కున వేలేసుకుంటున్నారు.

శిథిలావస్థలో సీతాకోక చిలుకల పార్కు



జూలో శిథిలమై కళావిహీనంగా మారిన సీతాకోక చిలుకల పార్కు

ఆరిలోవ: ఇందిరాగాంధీ జూ పార్కులో సీతాకోక చిలుకల పార్కు శిథిలావస్థకు చేరింది. గతంలో ఇక్కడ సందర్శకులను కనువిందు చేసిన వివిధ రకాల సీతాకోక చిలుకలు మాయమయ్యాయి. దీంతో సందర్శకులు వెళ్లకపోవడంతో ఈ పార్కు వెలువెలబోతోంది. సాధారణంగా జూ పేరు చెప్పగానే రకరకాల పక్షులు, ఎన్నో జాతుల జంతువులు గుర్తుకు వస్తాయి. జూకి వెళ్లే సందర్శకులకు వాటి నుంచి వినోదంతోపాటు విజ్ఞానం లభిస్తోంది. ఇక్కడ జూ అధికారులు మాత్రం సందర్శకులకు వాటితోపాటు మరింత వినోదం కోసం సీతాకోక చిలుకలను అందుబాటులోకి తీసుకురావాలని 2010లో బయోస్కోప్ సమీపంలో నీటి ఏనుగుల ఎన్‌క్లోజరు ఎదురుగా సుమారు 1,000 చదరపు గజాల విస్తీర్ణంలో సీతకోక చిలుకల పార్కు ఏర్పాటు చేశారు. ఈ పార్కులో రకరకాల సీతాకోక చిలుకలను ఉత్పత్తి చేశారు. దీంతో ఇక్కడకు వెళ్లే సందర్శకులకు రంగురంగుల చిలుకలు కనువిందు చేసేవి. ఈ చిలుకలు బయటకు ఎగిరిపోకుండా ఇనుప మెస్‌తో పైకప్పు ఏర్పాటు చేశారు. దానిలో చిన్న రంధ్రాల నుంచి గాలి, వెలుతురు వెళ్లే ఏర్పాటు చేశారు. ఇప్పుడు ఆ పరిస్థితి కనుమరుగైంది. ఈ పార్కు శిథిలావస్థకు చేరి సుమారు రెండు సంవత్సరాలు గడుస్తున్నా జూ అధికారులు పట్టించుకోలేదు. దీని లోపల సందర్శకులను కనువిందు చేసే ఫౌంటైన్ మూగబోయింది. ఇప్పుడు ఆ ఫౌంటైన్ పనిచేయడం లేదు. దాని చుట్టూ వివిధ రకాల పూల మొక్కలు, సీతకోక చిలుకలకు ఆహారం కోసం మధుర రసాలను ఇచ్చే మొక్కలు ఎండిపోయాయి. పార్కు పైకప్పు శిథిలమైంది. పైకప్పు మీద వేసే మెస్ పూర్తిగా చిరిగిపోయింది. దీని ద్వారానికి అమర్చిన మెస్‌ది కూడా అదే పరిస్థితి. ఈ పార్కు శిథిలం కావడంతో ఇందులో చిలుకలు బయటకు ఎగిరిపోయాయి. ఈ పార్కును పునర్నిర్మించాలని జూ అధికారులను సందర్శకులు కోరుతున్నారు.

వేమన పద్యాలు జీవన సత్యాలు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్

ఏయూ క్యాంపస్: వేమన పద్యాలు నిత్య జీవన సత్యాలని పలువురు వక్తలు అన్నారు. బీచ్‌రోడ్డులో యోగి వేమన విగ్రహం వద్ద శ్రీ వేమన సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ పాల్గొన్నారు. ముందుగా యోగి వేమన విగ్రహానికి పూలమాల వేసి అంజలి ఘటించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తెలుగు వారి నాలుకపై వేమన పద్యాలు నిత్యం వినిపిస్తాయన్నారు. చిన్నారుల నుంచి పెద్దల వరకు వేమన పద్యాలను పఠించడం, వల్లించడం దినచర్యలో భాగంగా మారిపోయిందన్నారు. సామాజిక చైతన్యానికి, దురాచారాలను రూపుమాపడానికి ఆయన రచనలు దోహదపడ్డాయన్నారు. వేమన సంక్షేమ సంఘం గౌరవ అధ్యక్షుడు గుడిమెట్ల మధుకుమార్ మాట్లాడుతూ విశ్వదాభిరామ వినురవేమ పద్యం చదవని వారు, వినని తెలుగు వారు ఉండరన్నారు. మాజీ ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి మాట్లాడుతూ వేమన పద్యాలు సరళంగా, లోతైన భావాలతో ఉంటాయన్నారు. ప్రతీ వ్యక్తి జీవితానికి వేమన పద్యాలు ఎంతో అవసరమన్నారు. ఈ సందర్భంగా పరవస్తు ఫణిశయిన సూరి వేమన శతకాన్ని చదివి వినిపించగా, రచయిత్రి సుజాత మూర్తి కార్యక్రమాన్ని నడిపించారు. కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి సత్తి నాగేశ్వర రెడ్డి, మాజీ ఎమ్మెల్యే తిప్పల గురుమూర్తి రెడ్డి, నాయకులు కొయ్య ప్రసాద రెడ్డి పాల్గొన్నారు.